క్లుప్తంగా

రాష్ట్ర గవర్నర్‌కు స్వాగతం



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి

రేణిగుంట: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు శుక్రవారం రేణిగుంట విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. రెండ్రోజుల పర్యటన నిమిత్తం ఉదయం 9గంటలకు విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, వేదిక్ యూనివర్సిటీ వీసీ సదాశివమూర్తి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ సిరాజ్‌బాషా తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన తిరుపతి ఎస్వీ వేదిక్ యూనివర్సిటీలో 7వ కాన్వొకేషన్‌కు హాజరై, మధ్యాహ్నం 2.10గంటలకు తిరిగి రేణిగుంట విమానాశ్రయం నుంచి వైఎస్సార్ కడప జిల్లాకు వెళ్లారు. ఆయనకు జేసీ బాలాజీ, ఆర్డీఓ రామారావు, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ రాజ్ కిషోర్, లైజాన్ ఆఫీసర్ చెన్నయ్య, సీఎస్ఓ రాజశేఖర్‌రెడ్డి తదితరులు వీడ్కోలు పలికారు. కడప పర్యటన అనంతరం గవర్నర్ తిరిగి ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని తిరుమలకు వెళ్లారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఏర్పేడు: మండలంలోని కొత్తవీరాపురం వద్ద శుక్రవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి చెప్పారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న కిషోర్‌రెడ్డి

ఏర్పేడు: మండలంలోని కొత్తవీరాపురంలో గ్రామస్తుడు మునస్వామి(55) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మురగయ్య, రాజేంద్రన్, వెంకటేశ్వర్లు, దొరబాబు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): వేసవి సెలవుల్లో పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించి, వారిపై ఓ కన్నేసి ఉంచాలని సీఐ ఎస్.విక్రమ్ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వేసవి సెలవుల్లో వ్యవసాయ బావులు, చెరువుల్లో ఈతకు వెళ్లే యువకులు జాగ్రత్తలు పాటించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. అలాగే ఎండలు విపరీతంగా ఉండడంతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నేడు 'జగనన్నే మా భవిష్యత్తు' విజయోత్సవ బైక్ ర్యాలీ

శ్రీకాళహస్తి: పట్టణంలో శనివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ముగింపు సందర్భంగా విజయోత్సవ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. వైఎస్ఆర్ సర్కిల్ నుంచి ఎమ్మెల్యే కార్యాలయం వరకు ఈ ర్యాలీ నిర్వహిస్తారు. ఈ ర్యాలీని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఉదయం 9గంటలకు ప్రారంభిస్తారు.

నేటి నుంచి చిన్నకొట్టాయి ఉత్సవం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం నుంచి చిన్నకొట్టాయి ఉత్సవం నిర్వహించనున్నట్లు ఈవో సాగర్‌బాబు తెలిపారు. శనివారం నుంచి మే 5వ తేదీ వరకు ఈ ఉత్సవం నిర్వహిస్తామని, ఆలయ అలంకార మండపం నుంచి స్వామి అమ్మవార్లు బయలుదేరి, పగడ చెట్టు వద్ద విశేష అభిషేకం అందుకుంటారన్నారు. అనంతరం మూడు ప్రదక్షిణలు చేసి దీపారాధన, హారతులు సమర్పించి తిరిగి ఆలయంలోకి తీసుకెళుతారని తెలిపారు.

రేపటి నుంచి ఊరందూరులో వార్షిక బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తి: ఊరందూరులోని శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ శ్రీచెన్నకేశస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు 30 నుంచి మే 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఈఓ సాగర్ బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు ఈ ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

రేపు మెగా రక్తదాన శిబిరం

శ్రీకాళహస్తి: పట్టణంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు యువతరం సేవాసమితి సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నిరాశ్రయుల వసతి గృహంలో ఉదయం 9.30 గంటలకు ఈ శిబిరం ప్రారంభమవుతుందని, ఆసక్తి కలిగిన యువత రక్తదానం చేయాలని, మరిన్ని వివరాలకు 8885395305 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మామిడి.. నష్టాలే దిగుబడి

తొట్టంబేడు మండలంలో మామిడి తోటల రైతుల ఆశలు అడియాసలవుతున్నాయి. చెట్లంతా పూతతో కనిపించినప్పటికీ ఆశించిన దిగుబడి లేదని ఆవేదన చెందుతున్నారు. తెగుళ్లు కూడా కొంతవరకు దెబ్బతీశాయి.



మామిడి చెట్లు, (ఇన్‌సెట్) పిందె దశలోనే తెగుళ్లు ఆశించిన కాయ

- మండలంలో 500 ఎకరాలలో సాగు
- మామిడి రైతును దెబ్బతీసిన తెగుళ్లు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని కొత్తకండ్రిగ, కాసారం, చోడవరం,అక్కుర్తి చిట్టత్తూరు, గొడమాల, తంగేళ్లపాళెం,శివానాథపాళెం, కంచనపల్లె, బోనుపల్లె తదితర గ్రామాల్లో మామిడి తోటలు ఉన్నాయి. పెద్ద చెట్ల నుంచి ఎకరాకు ఐదు టన్నులకు పైగా దిగుబడి వచ్చే పరిస్థితి నుంచి కేవలం టన్నుకు పడిపోయింది. మామిడి చెట్లకు రెండు పర్యాయాలు పూత వచ్చినా ప్రయోజనం మాత్రం కనిపించడం లేదు. మూలిగే నక్కపై తాటి కాయ పడిందన్న చందంగా ముందే దిగుబడి లేక అల్లాడుతున్న మామిడి రైతులకు ధరల పోటు మరింత ఆందోళనకు గురిచేస్తోంది.

తగ్గిన దిగుబడి

మండలంలో మామిడి తోటలు అధికంగానే ఉన్నాయి. వీటిలో ప్రధానంగా బేనీషా, తోతాపురి, పునామా, మల్లిక, సువర్ణరేఖ తదితర రకాలు ఉన్నాయి. ఫిబ్రవరిలో కురిసిన గాలీవాన ధాటికి మామిడి పూత చాలా వరకు దెబ్బతింది. చలి, మంచు ప్రభావమో తెలియదుగానీ దిగుబడులు మాత్రం గణనీయంగా తగ్గిపోయాయి. ఇటీవల వరకు మొదటి రకం బేనీషా, తోతాపురి తదితర రకాలు టన్నుకాయలు రూ.60వేల నుంచి 70వేలు పలకగా, ప్రస్తుతం రూ.25 వేల నుంచి 35వేలకు పడిపోయింది.



రైతుకు సూచనలు చేస్తున్న ఉద్యానవనశాఖాధికారులు

తెగుళ్ల దెబ్బకు నష్టం

నాకు ఐదు ఎకరాల మామిడితోపు ఉంది. పోయిన సంవత్సరం 25నుంచి 30 టన్నుల వరకు దిగుబడి రావడంతో మంచి వచ్చింది. ఇప్పుడు కాపు తక్కువగా ఉండడంతో రూ.లక్ష కూడా ఆదాయం వస్తోందో తెలియని పరిస్థితి ఉంది. ఈసారి 5 నుంచి 8 టన్నుల కాయలు వచ్చే పరిస్థితి ఉంది. తెగుళ్ల ఆశించడంతో పూత దశలోనే చాలా వరకు నష్టం వస్తోంది.

– శ్రీనివాసులురెడ్డి, చిట్టత్తూరు, తొట్టంబేడు మండలం

తగ్గిన దిగుబడి



ఈ ఏడాది చలి, మంచు, వర్షాలు, ఇతర కారణాల వల్ల మామిడి దిగుబడి శాతం తగ్గింది. 500 ఎకరాల్లో పంటను పరిశీలిస్తే దిగుబడి తగ్గిందనే చెప్పాలి. వాతావరణ ప్రభావంతో మొదట వచ్చిన పిందెలు నిలబడ్డాయి. రెండు, మూడు విడతలలో వచ్చిన కాయలు నిలబడలేదు. ఫిబ్రవరిలో కురిసిన వర్షాల వల్ల చాలా వరకు నష్టం కలిగింది. మండలంలో ఇంకో 15 రోజుల్లో కాయలు కోతకు వస్తాయి.

– ఏ.పుష్పలత, నియోజకవర్గ ఉద్యానవనశాఖాధికారి

లోకోస్ యాప్‌పై సంఘమిత్రలకు అవగాహన

సత్యవేడు: మండలంలోని సంఘమిత్రలు లోకోస్ యాప్ నిర్వహణపై అవగాహన పెంచుకోవాలని ఏపీఎం స్వర్ణలత అన్నారు. లోకోస్ యాప్ నిర్వహణ విధానంపై శుక్రవారం వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సంఘమిత్రలకు అవగాహన, శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ, దేశం అంతటా ఒకే యాప్‌లో స్వయం సహాయక సంఘాల వివరాలు ఉండేలా కేంద్ర ప్రభుత్వం లోకోస్ యాప్‌ను రూపకల్పన చేసిందన్నారు. దీనివల్ల దేశంలో ఎక్కడ నుంచైనా సంఘాల వివరాలు, ఆర్థిక లావాదేవీలను పరిశీలించే వెసులుబాటు ఉంటుందన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మే 23 లోపు ఎస్సీ, ఎస్టీ నూతన సంఘాల నమోదు చేయాలన్నారు. కొత్త సంఘాల్లో సభ్యుల చేరిక, బ్యాంకు అకౌంట్లు ప్రారంభం, ఆగిన సంఘాల పునరుద్ధరణ పనులు గడువు లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ట్రైనర్లు లోకేశ్వరి, రేవతి, శివమ్మ, రాజేశ్వరి సంఘమిత్రలకు కంప్యూటర్‌లో యాప్ నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీ పయణి, డీఎంజీ లక్ష్మయ్య, సంఘమిత్రలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎం స్వర్ణలత

సత్తా చాటిన గురుకుల బాలిక

- రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం

సత్యవేడు: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో సత్యవేడు అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాలలో బైపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న డి.లావణ్య 432/440 మార్కులు సాధించి రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో ప్రథమ స్థానంలో నిలిచిందని ఆ కళాశాల ప్రిన్సిపల్ ప్రసూన తెలిపారు. ఆమె తల్లిదండ్రులు త్యాగరాజులు, దేవి వ్యవసాయ కూలీలని చెప్పారు. చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం జవుకుపల్లెకు చెందిన లావణ్య చదువుల్లో బాగా రాణిస్తోందని తెలిపారు. ఇక, గురుకుల పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల అధ్యాపకులతో పాటు ఎంఈఓ కే.రవి అభినందించారు.



తల్లిదండ్రులతో లావణ్య

పరిసరాల శుభ్రత ముఖ్యం



పాత నీటి తొట్టిలలో నిల్వ నీటిని తొలగించి శుభ్రం చేస్తున్న వైద్య సిబ్బంది

సత్యవేడు: పరిసరాల శుభ్రత పాటించాలని తిరుపతి ఆరోగ్యశాఖ సబ్ యూనిట్ అధికారి శివసుబ్రమణ్యం సూచించారు. స్థానిక పంచాయతీలోని రెండవ సచివాలయ పరిధిలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని దాసుకుప్పం పీహెచ్‌సీ ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది నిర్వహించారు. గంగమిట్ట, గొల్ల వీధుల్లో మురుగు కాలువలను పరిశీలించి పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. స్థానికులకు సీజనల్ వ్యాధులపై సుబ్రమణ్యం అవగాహన కల్పించారు. ప్లాస్టిక డ్రమ్ముల్లో నీరు నిల్వ ఉంచరాదని, దోమలకు ఆవాసమవుతాయని ఆ నీటిని తొలగించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సహాయమేరి, ఆశావర్కర్లు వెంకటలక్ష్మి, దాక్షాయణి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు స్వర్ణబిందు ప్రాసన



స్వర్ణబిందు ప్రాసన చేస్తున్న లోకా ఫౌండేషన్ ప్రతినిధులు

వరదయ్యపాళెం: పిల్లల్లో రోగనిరోధక శక్తి పెంచడానికి, జ్ఞాపకశక్తి, శారీరక, మానసిక వికాసానికి లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పిల్లలకు స్వర్ణబిందు ప్రాసన ద్వారా చుక్కల మందు వేశారు. ఏకం క్షేత్రంలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో 500 మంది పిల్లలకు స్వర్ణబిందు ప్రాసన ఔషధం ఉచితంగా పంపిణీ చేశామని లోకా ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ లోకేష్ దాసాజీ తెలిపారు. ఆయుర్వేద పద్ధతిలో ఈ మందును సిద్ధం చేశామని, ప్రతినెలా పుష్యమి నక్షత్రం రోజున స్వర్ణబిందు ప్రాసన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ సునీల్ దాసాజీ, పంచకర్మ వైద్య నిపుణులు యువరత్న పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యాబుద్ధులు



గోవర్ధనపురం హైస్కూల్‌లో జరిగిన సరస్వతి పూజ

వరదయ్యపాళెం: చిన్నవయస్సు నుంచే క్రమశిక్షణతో విద్యాబుద్ధులు అలవరచుకోవాలని గోవర్ధనపురం ప్రాథమిక పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో సరస్వతి పూజను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు గురువుల ఆశీస్సులు పొందారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ సరస్వతితో పాటు అబ్దుల్ మాట్లాడారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పామల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ముజీబ్, సత్యవతి, స్కూల్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ శరణ్య, స్థానికులు గుత్తి త్యాగరాజు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు

మండలంలోని వెంగారెడ్డికండ్రిగ ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న టీచర్లు శ్రీనివాసులు, అప్పారావుల సేవలు అభినందనీయమని స్థానిక విద్యార్థుల తల్లిదండ్రులు కొనియాడారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో మండల భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరావు వారిని ఘనంగా సత్కరించారు.

ప్రతి గడపలో సంక్షేమం..సంతోషం

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి రూరల్: నవరత్నాలకు సంబంధించి గడప గడపకు సంక్షేమ పథకాలు అందడం వలన ప్రజల్లో చెప్పలేని సంతోషం ఉందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అరవకొత్తూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. గ్రామంలో 237 ఇళ్లకు వెళ్లి ప్రజలతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా? అని అడిగి తెలుసుకున్నారు.

శ్రీకాళహస్తికి కూతవేటు దూరంలో ఉన్న తమ గ్రామానికి బీటీరోడ్డు వేయాలని మొరపెట్టుకున్నా ఫలితం లేదని, అయితే మధుసూదన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యేగా గెలిచాక ఏడాదిలోపు తారు రోడ్డు వేయించారని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

మురుగు కాలువలు లేకపోవడంతో మురుగు నీరంతా వీధుల్లో ప్రవహిస్తోందని, కాలువలు నిర్మించాలని, అలాగే ఉన్న ప్రతి వీధికీ సీసీరోడ్లు వేయాలని గ్రామస్తులు కోరారు. తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంక్ లీకేజీలతో కూలేస్థితికి చేరుతోందని, దెబ్బతిన్న పైపులైన్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని నివేదించారు. కొత్తగా గ్రామంలోనే ఇళ్లు నిర్మించుకోవడానికి ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించారు. ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు నిధులను సీఎం కేటాయించారని, ప్రధాన సమస్యలను ఈ నిధులతో పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ శంకరయ్య, శివారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు కాపిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, ఏపీ సీడ్స్ డైరెక్టర్ కండాటి ఈశ్వర్‌రెడ్డి, సొసైటీ బ్యాంక్ చైర్మన్ చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, మధు, నాగరాజు, గిరి, కిషోర్, సుబ్రమణ్యం, సుబ్రమణ్యంరెడ్డి, చంద్ర, మునిరాజ, సుధాకర్, రవీంద్ర, మోహన్, సురేష్, మునివేలు, భానుమూర్తి యాదవ్, వెంపల్ల సురేంద్రయాదవ్, ఏనుగారి నాగభూషణ్ యాదవ్, రేపల్లి మల్లికార్జున్ మొదలియార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించరూ!

- కలెక్టర్, డీఆర్ఓ, సీఎండీలకు ఎమ్మెల్యే ఆదిమూలం వినతి

పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్, డీఆర్ఓ, విద్యుత్ శాఖ సీఎండీలను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. శుక్రవారం మధ్యాహ్నం తిరుపతిలో కలెక్టర్ వెంకటరమణా రెడ్డిని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే కలిశారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం ఇచ్చారు. అనంతరం డీఆర్ఓ శ్రీనివాసరావును కలిసి సమస్యలను నివేదించారు. ఆ తర్వాత విద్యుత్ శాఖ జిల్లా కార్యాలయంలో సీఎండీ సంతోషరావుతో సమావేశమయ్యారు. తమ నియోజకవర్గంలో పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల కొరత మూలాన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ ఆ గ్రామాల జాబితాను సీఎండీకి ఇచ్చారు. స్పందించిన సీఎండీ సమస్యల్ని పరిష్కరించాలని ట్రాన్స్‌కో ఎస్ఈ క్రిష్ణారెడ్డికి సూచించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కలెక్టర్, డీఆర్ఓలు సైతం సమస్యలపై సానుకూలంగా స్పందించినట్లు ఆదిమూలం తెలియజేశారు.



తిరుపతిలో సీఎండీ సంతోషరావుకు విద్యుత్ సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

సత్యవేడు: మండలంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ ఈఈ ఎంవీ మోహన్‌రావు లబ్ధిదారులను కోరారు. శుక్రవారం సత్యవేడు పంచాయతీలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను డీఈ శ్రీనివాసరావుతో కలిసి ఆయన పరిశీలించారు. పంచాయతీలో 319 ఇళ్లు మంజూరు కాగా 108 ఇళ్లు ప్రారంభించారని, 14 ఇళ్లు పూర్తి కాగా 41 గృహాలు శ్లాబ్ వేసి ఉన్నట్లు ఏఈ వెంకటసుబ్బయ్య తెలిపారు.156 ఇళ్లు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. మే15 లోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించే దిశగా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చొరవ చూపాలన్నారు. అంతకు ముందు సచివాలయ సిబ్బందితో ఇదే విషయమై సమీక్షించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కీర్తన, శ్రీహర్ష, త్యాగరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



సత్యవేడు జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఈఈ మోహన్‌రావు

ఎస్సీ, ఎస్టీలపై వివక్ష నేరం

బుచ్చినాయుడుకండ్రిగ: ఎస్సీ, ఎస్టీలపై ఇతర కులాల వారు కుల వివక్ష చూపితే చట్టరీత్యా చర్యలు తప్పవని తహసీల్దారు టీవీ సుబ్రమణ్యం హెచ్చరించారు. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీలోని లక్ష్మీపురం ఎస్టీ కాలనీలో సామాజిక న్యాయంపై రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు, పోలీసు శాఖ ఆధ్వర్యంలో గిరిజనులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం కల్పిస్తున్న హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అగ్రవర్ణాల వారు ఎస్సీ, ఎస్టీలను చిన్న చూపు చూడరాదన్నారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వ పథకాలు అందకపోతే తమ దృష్టికి తేవాలని, వివక్షకు గురైతే తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్బలక్ష్మి, ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, ఆర్ఐ వెంకటసుబ్బయ్య, సర్పంచ్ వెంకటమ్మ, వీఆర్ఓ ప్రసాద్, ఉపసర్పంచ్ మునిరాజా, పోలీసు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు సుబ్రమణ్యం

ప్రభుత్వ కళాశాలలో మెరుగైన వసతులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): ప్రభుత్వ కళాశాలలో మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు తొట్టంబేడు బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుండేలుగుంట సచివాలయంలో సిబ్బంది, వలంటీర్లు, అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పదవ తరగతి పాస్ అయిన బాలికలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పేందుకు వలంటీర్లు సహకరించాలని కోరారు. ప్రభుత్వ కళాశాలలో అర్హత కలిగిన అధ్యాపకులు ఉన్నారని నాణ్యమైన విద్యాబోధన చేస్తారన్నారు. పంచాయతీ సీనియర్ కార్యదర్శి ఆనంద్‌బాబు మాట్లాడారు. నాడు-నేడుతో ప్రభుత్వం కళాశాలలు రూపురేఖలు మారాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న పంచాయతీ సీనియర్ కార్యదర్శి ఆనంద్‌బాబు

ఘనంగా పాఠశాల వార్షికోత్సవాలు

ఏర్పేడు: మండలంలోని ఎండీపుత్తూరు, మాధవమాల ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా వార్షికోత్సవాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సరస్వతీదేవి చిత్రపటానికి పూజలు చేశారు. వివిధ క్రీడల పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు మోహనప్రియ, బల్కిస్ బేగం, మండల వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి కరీముల్లా పాల్గొన్నారు



ఎండీపుత్తూరులో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ మోహనప్రియ

శేషవాహనంపై అగస్త్యేశ్వరుడి అనుగ్రహం

నారాయణవనం: మండలంలో సముదాయంలోని టీటీడీ అనుబంధ మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సాలలో శుక్రవారం రాత్రి శేషవాహనంపై ఉత్సవమూర్తులు మేళతాళాలు, కోలాటాల మధ్య విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. తొలుత ఉదయం అర్చకులు నిత్యపూజాది కార్యక్రమాలను పూర్తి చేశారు. ఉదయం 10.30 గంటలకు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. కార్యక్రమంలో స్థానిక ఆలయాల ఏఈఓ మోహన్, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ఆలయ అర్చకులు రమేష్ గురుకళ్, జమేదార్ విజయకుమార్ తదితరులు పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాలలో ఐదవ రోజు శనివారం సాయంత్రం అగస్త్యేశ్వరస్వామి నంది వాహనంపై విహరిస్తారు.



శేష వాహనంపై అగస్త్యేశ్వరస్వామి

కల్యాణం.. కమనీయం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకస్వాములు



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

పిచ్చాటూరు: మండలంలోని శ్రీ లక్ష్మీగణపతి హనుమతీశ్వరాలయ మహా కుంభాభిషేకంలో భాగంగా శుక్రవారం రాత్రి 7 గంటలకు సీతారాముల ఉత్సవమూర్తులను మండపంలో అధిష్టించి విశేష అలంకరణలు చేశారు. స్వామివారిని వరునిగా, పార్వతీదేవిని వధువుగా ముస్తాబు చేసి, అర్చకస్వాముల వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు నడుమ భక్తజనం సందోహం నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. రాత్రి 9 గంటలకు లక్ష్మణ సమేత నవ వధూవరులైన సీతారాములను ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జ్యోతిరాజు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఆగమోక్తంగా శుక్రవార ఉత్సవం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో జ్ఞానప్రసూనాంబ అమ్మవారికి శుక్రవారం ఆగమోక్తంగా శుక్రవార ఉత్సవం నిర్వహించారు. తొలుత అమ్మవారి ఉత్సవమూర్తికి పలు రకాల అభిషేకాల అనంతరం విశేష అలంకరణ చేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ చప్పరాలపై అధిష్టించిన అమ్మవారికి ఆలయ ప్రాకారంలో ఉత్సవం నిర్వహించారు. ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



అమ్మవారిని ఊరేగింపుగా తీసుకు వస్తున్న దృశ్యం